విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
31 Aug 2026 - Page 8
epaper.visionandhra.in

చిన్నారి సంకెళ్ళు తెంచిన "విజన్ ఆంధ్ర" కథనం..

పసిపాప కండ్లలో వెల్లివిరిసిన ఆనందం...

ESTD - 1999 విజన్ ఆంధ్ర

ఎఫెక్ట్

- అధికారుల తక్షణ స్పందన..!
- సెలవు రోజైనా కదిలిన బాలల సంక్షేమ యంత్రాంగం..
- చిన్నారి, తల్లి ఇద్దరు సఖి కేంద్రానికి తరలింపు
- సోమవారం సీడబ్ల్యూసీ ఎదుట హాజరు...
- తల్లికి కౌన్సెలింగ్ అనంతరం తుది నిర్ణయం..
- చిన్నారి భద్రతపై అధికారుల ప్రత్యేక దృష్టి, విస్తృత చర్యలు
- షెభాష్ విజన్ ఆంధ్ర అంటూ బృందాన్ని,
- యాజమాన్యాన్ని ప్రశంసిస్తున్న అధికారులు, ప్రజలు.

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 30 (విజన్ ఆంధ్ర) :

చిన్నారిని ఇంట్లో ఒంటరిగా ఉంచుతున్నారనే అంశంపై "బాల్యానికి సంకెళ్లు... " అనే శీర్షికతో విజన్ ఆంధ్ర దినపత్రికలో ఆగస్టు 30 ఆదివారం పేజ--3లో ప్రచురితమైన కథనం మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. విషయం తీవ్రతను గుర్తించిన అధికారులు, ఆదివారం సెలవు రోజైనప్పటికీ వెనువెంటనే తగిన చర్యలు చేపట్టారు. కథనాన్ని గమనించిన జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి (డీపీసీవో) ఇంతియాజ్ రహీం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) చైర్‌పర్సన్ ఎ.ఎం. రాజారెడ్డి, జిల్లా మహిళా--శిశు సంక్షేమ అధికారి తారక సమన్వయంతో... సీ డబ్ల్యూ సీ అధికారి సతీష్ మరియు కొంతమంది సిబ్బందిని వెంటనే క్షేత్రస్థాయికి పంపించి విచారణ చేపట్టారు.

చిన్నారి పరిస్థితి పై మొదట ఆరా...

పేట్‌బషీరాబాద్ ప్రాంతంలో చిన్నారి పరిస్థితిపై మొదట కాలనీలో ఉదయం నుండి ఆరా తీసిన అధికారులు, అనంతరం సాయంత్రం తల్లి వచ్చేవరకు వేచివుండి, ఆమెను పలు ప్రశ్నలు అడిగి వివరాలు సేకరించారు. అనంతరం చిన్నారిని, తల్లిని పేట్‌బషీరాబాద్ పోలీసుల రక్షణలో అల్వాల్‌లోని సఖి కేంద్రానికి తరలించారు. అక్కడ వారి పరిస్థితిని పరిశీలించిన అనంతరం తదుపరి చర్యల్లో భాగంగా సోమవారం చిన్నారితో పాటు ఆమె తల్లిని కూడా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఎదుట హాజరుపరచనున్నారు.

సీడబ్ల్యూసీ ఎదుట పరిశీలన

చిన్నారి, ఆమె తల్లి పరిస్థితులను సీడబ్ల్యూసీ సభ్యులు పరిశీలించనున్నారు. తల్లికి అవసరమైన కౌన్సెలింగ్ అందించిన అనంతరం కుటుంబ పరిస్థితులు, చిన్నారి భద్రత, సంరక్షణ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనున్నారు. చిన్నారిని జడ్జి ఎక్కడ ఉంచాలి? ఆమెకు ఎలాంటి సంరక్షణ, రక్షణ అవసరం? అనే అంశాలపై సీడబ్ల్యూసీ తగిన నిర్ణయం తీసుకోనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

చిన్నారి భద్రతకే తొలి ప్రాధాన్యం

చిన్నారి భద్రత, మానసిక ప్రశాంతత, భవిష్యత్ సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇస్తూ తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. చిన్నారికి సురక్షితమైన వాతావరణం, అవసరమైన సంరక్షణ కల్పించే అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

సెలవు రోజైనా స్పందన...

సాధారణంగా సెలవు రోజుల్లో అధికారిక కార్యకలాపాలు పరిమితంగా ఉన్నప్పటికీ, చిన్నారి సమస్యపై ప్రచురితమైన కథనాన్ని గమనించిన వెంటనే అధికారులు స్పందించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సంబంధిత సిబ్బందిని రంగంలోకి దించి, చిన్నారి--తల్లిని సఖి కేంద్రానికి తరలించి, సీడబ్ల్యూసీ ముందు హాజరుకు చర్యలు చేపట్టడం హర్షణీయం.

వెల్లువెత్తుతున్న ప్రశంసలు...

బాలల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియా కథనాలపై అధికారులు సత్వరమే స్పందించి, అవసరమైన చర్యలు చేపట్టడం ద్వారా బాలల భద్రత, సంరక్షణకు మరింత భరోసా కలుగుతుందని స్థానికుల అభిప్రాయం వినబడు న్నారు. చిన్నారి సమస్యపై స్పందించి తక్షణ చర్యలు చేపట్టిన అధికార యంత్రాంగాన్ని, అటు **విజన్ ఆంధ్ర పత్రిక** కృషిని రాష్ట్ర వ్యాప్తంగా అందరు అభినందిస్తున్నారు.